


శ్రీ: యన్. ఆర్. చందూరి

మధ్యాహ్నం రెండుగంట వేళ...

"రాజా - నువ్వు పూర్తిగా పాసయావు"

"ఆలాగాండి - అత్తగారితో చెప్తాను"

"లేదు. ఎక్కడికో వెళ్లింది"

"మీ నాన్నగారికి తెలుసా?"

"నాన్నగారికే వచ్చింది టెలిగ్రామ్. ఆయనే ఆఫీసునుంచి యింటికి పంపారు"

"కాఫీవేళ అయినట్లుంది. కాఫీ కాచమన్నారూ..."

"ఊఁ సరే"

"ఆ టెలిగ్రామ్ - నన్ను చూడనీయరూ"

అల్లాగే...సంతోషంలో చెప్పడం మర్చిపోయాను. 'క్లాస్' కూడా వచ్చింది. ఫస్టుక్లాస్‌లో పాసయావు సుమా...ఏదీ ఒక్కసారి ముద్దు..."

"అబ్బ వేళాపాళా లేదుటండీ"

"...................."

"మరి బి. ఏ. చదవ్వూ?"

"మీ యిష్టం"

"నాయిష్ట మేమిటి?—నీకు మనస్ఫూర్తిగా చదవాలని వుందా?"

"చదవాలని వుంది...కాని"

"ఏమిటా సందేహం"

"మిమ్మల్ని వదలిపెట్టి ఎలా వుండగలనా అని"

"ఓస్...యిన్నాళ్లనుంచీ వుండలేదూ?"

"ఇన్నాళ్లనుంచి వుత్తిత్తి - పేరుకి - భార్యాభర్తలం. ఇప్పుడు - మరి...నాకు సిగ్గేస్తుందండి కాలేజికి పోవడానికి..."

"సిగ్గెందుకూ - రాజమండ్రిలో మీ నాన్న గారింట్లోనే వుండి చదువుకో... నేను తరుచూ వస్తూవుంటాను"

"ఏమోనండీ - నేనుండలేను...నిన్న మటుకు నిన్న...ఎవరాయన - ఎవరో శ్రీనివాసయ్య గారితో మీరు రెండో ఆటకి సినిమాకి వెళ్ళారా?- మళ్లీ మీరు తిరిగివచ్చే వరకూ కనుకు పడ్తే ఒట్టు..."

"నేను చెప్పేది గ్రహించు. ఫలానాయన ఎం. ఎ. ప్రొఫెసరు...ఆయన పెళ్లాం కనీసం బి. ఏ. అవుతే ఎంత గౌరవమో ఆలోచించుకో..."

"నాకుమాత్రం సరదా లేదూ చదువుకోనెందుకు?...పోనీ మీతో మద్రాసుల్లోనే వుండి క్వీన్ మేరీస్ కాలేజీలో చదువుకుంటేనో!

'ఆఁ నాదగ్గిర వుంటే చదువు వచ్చినట్టే... పయిగా కాలేజికి వెళ్లడానికి అంతరాయము కూడా వస్తుందేమో...'

"సరే...మీ నాన్నగారినీ అమ్మగారినీ కూడా కనుక్కుందాం. అందరికేది బాగుంటుందో అదే చేద్దాం...ముందు కాఫిచేయనీయండి..."

♦ ♦ ♦

కలకత్తా మెయిల్ అంత అంధకారంలోనూ లక్ష్యం చేయకుండా పరుగెడుతూ వుంది...ఆ యువకజంట సెకండ్ క్లాస్ కాంపార్టుమెంటులో స్థలసంకోచం లేకుండా ప్రయాణం చేస్తున్నారు.

"తలుపులోపల గడియ వేసేద్దురూ...స్టేషన్ వస్తూంది...పయిగా తెల్లవార వస్తూంది..."

"ఇది రిజర్వు చేయించానులే"

"అబ్బ నిద్దరోస్తోంది నాకు..."

"వీల్లేదు..."

"....................."

"....................."

"రాత్రి మెయిల్ కే తిరిగీ వెళ్లి పోవాలంటున్నారూ...మళ్లీ యెన్నాళ్లకొస్తారో!—"

"మళ్లీ ఆగష్టు 8-వ తారీఖున వస్తాను కాదూ"

"అదిగో-అన్నీ అబద్ధాలే! ఇందాక ఒకటో తారీకు అని యిప్పుడు మళ్లీ ఎనిమిదంటున్నారూ!"

"వారమే కాదూ తేడా"

"స్టేషన్ వచ్చిందండీ"

"బెజవాడనుకుంటాను"

"స్పెన్సరు తెరిచారేమో...ఆకలేస్తోంది. ఒకప్పు కాఫీ తెప్పిద్దురూ..."

"ఆకలెయ్యదూ మరి" అంటూ...

"అబ్బ ఏమిటండి. ఎవరయినా చూస్తారు"

* * *

నెలరోజులయింది ... నెలేమిటి? ఎల్లుండికి నెలమీద పదిహేను రోజులు...అబ్బ! యెన్నాళ్లయి పోయిందో! ఆయనకు అసలు నేను మళ్లా జ్ఞాపకం వున్నానో - లేనేలేనో? ఏదో... ఆ మద్రాసులో మెరినా నిండా నాబోటివాళ్లు ఎంతమందో...అన్నట్టు మర్చిపోయాను ఆయన క్లాసులో ఆడపిల్లలు వున్నారుట కాదూ... అంతే...అంతే...ఏదో ఆలాటిదే అనుభవం

టుంది. లేకపోతే వుత్తరమన్నా వ్రాయరూ! ఉత్తరంవచ్చే నెలరోజులు అవవస్తోంది…అంతే యింకా సందేహ మెందుకూ?

పాడు వుక్క ఒకటే వుక్క పోస్తోంది కదా! పడక పడక నెల్లాళ్ళకి నాలుచినుకులు పడ్డాయి. ఆ చినుకులు పడ్డప్పుడు కాస్త చల్లగాలి వేసింది.

ఇప్పుడేమో వుమ్మరంగా వుంది… వెధవ ఫాన్…దానికి రోగం యివ్వాళే రావాలీ… డాబామీద పడుకొంటానంటే జలుబు చేస్తుంది- వద్దంటారు యీ పెద్దవాళ్లు.

వెధవలైటు! లైటువుంటే యీ పాడు దోమల బాధతో, నిద్రపట్టదు…లైటు ఆర్పేస్తే అమ్మయ్యో … భయం … నిద్రపట్టడం యెలా మరి! ఇవ్వాళ దోమలబాధ మరీ యెక్కువయిందే…

జగన్నాథమా … అంతా భ్రాంతే … ఆరే యిక్కడికి వచ్చాడనే అనుకొన్నానే!…

ఎంత అనాకారి వాడో అంత చెణుకుగా మాట్లాడుతాడు! బలేవాడు…ఏ లెక్చరరు అయినా జగన్నాథము నోటికి వెరవ వలసిందే!…ఇప్పుడు అతనువచ్చి ఏవయినా కబుర్లు చెప్పడం చేస్తే ఎంత బావుంటుంది!…

ఆయన యిప్పట్లో రారు. నేను అనుకుంటున్నదే లైటు. అంతే, అక్కడ ఎవరితోనో ఏమో…ఈ మొగాళ్లను నమ్మకూడదు. ఎందుకూ జగన్నాథం చూడరాదు. ఏదో ఎవరితోనో మాట్లాడుతూ యిట్టే నాతో మాటలు కలిపి వేస్తాడు … కొంటెవాడు … కళ్లురిమి చూస్తే మాటలు మారుస్తాడు.

అరే అప్పుడే యెనిమిదయింది. భోజనానికి పోకపోతే అమ్మ కోప్పడుతుంది.

* * *

వెధవ హామ్‌లెట్ (విసురుబుచ్చుకుని అవతల పారేసి) చినిగితే చినగనీ…జగన్నాథము అన్నట్లు హామ్‌లెట్ అంత వెధవ, ఎవడూ వుండడు…దిక్కుమాలిన దీపం (ఆర్పేసింది)

…ఎన్నాళ్లకొస్తారో మరాయన!…నిజంగా జగన్నాథం హుషారయిన వాడు…ఎవరికన్నా తెలుస్తుందేమో … సాయంత్రం చీకటిపడ్డ తర్వాత నయితే … నాన్నగారు క్లబ్బులో వుంటారు…అమ్మ వంటయిల్లుదాటి యివతలకి రాదు. ఏడున్నరదాకా మేడమీద పరాఖత్తుగా వుంటుంది…అంతే…బావుంది.

ఎవరికయినా తెలిస్తే…ఎవరూ నమ్మరు! జగన్నాథముతోటి అంటే అసలు నమ్మరు. పయిగా నవ్వుతారు. గిట్టనివాళ్లు గిట్టక అంటున్నారని అంటా అనుకోక తప్పదు…బలె. బలె. బాగుంది.

అర్థమవుతుందో కాదో … జగన్నాథానికి అర్థం కాకపోవడం … నాన్‌సెన్సు … యేమి తెలివితక్కువ … నేను మాట్లాడితే చాలునను కొంటాడు. అయితే అతనికి అపరిమిత మయిన భయమే…భయం పోగొట్టాలి…పోగొడ్తాను.

* * *

జగన్నాథము బలెవాడు…నిజంగా యిన్నాళ్లనుంచీ అనుకోలేదు. కాని చాలా మోజువుందన్న మాట. (నవ్వుకొంటూ) బలెవాడు… మధ్యాహ్నము వస్తూ వరండాలో పుస్తకం కింద పడేసే సరికితీసి అందించి 'థాంక్యూ' అంటే 'నో

షివల్‌రి' అన్నాడు. ఎంత చమత్కారంగా అన్నాడూ...సరే సాయంత్రం వస్తాడు. రానీ.

ఇన్నాళ్లీయన ఉత్తరమయినా రాయనందు కే దేశాస్త్రి...నా సంగతి ఆలోచించ నప్పుడు ఆయన సంగతి నేనెందు కాలోచించాలి...అసలు ఆయన ఎవరితో ఖులాసా చేస్తున్నాడో. అంతే అయివుండాలి. లేకపోతే ఈ వయస్సులో నన్ను చదువుకోమని యెందుకు తోలేవారు?...నా ఊహ నిజంగా సరయిందే...లేకపోతే యిన్నాళ్లనుంచీ ఉత్తరమయినా యెందుకు వ్రాయరు?...అవును నన్ను చదువు కోసమని యిక్కడ దిగవిడిస్తే అమ్మా నాన్నా కూడా కొంచె మాశ్చర్య పోయారు. ఆశ్చర్యపోరూ. కాని నన్ను మద్రాసులోనే చదివించ వచ్చునుగా...అక్కడవుతే నాకు చదువు సాగదనా ఆయన సాకు.

రెండు సంవత్సరాలు తోసేదామనుకున్నారు...ఎవరూ లేకపోతే నేనా...అవును తిన డాని కేమీ లేనప్పుడు ఊరగాయ జాడీకోసం చూసినట్టా! కాని...నేనేనా అంత తీసిపోయిన దాన్ని...

◆ ◆ ◆

ఏంచీరె కట్టుకోనూ! తెల్లటివాళ్లకి గులాబి రంగు చీర బాగుంటుందంటారు...ఊఁ...గులాబిరంగు సిల్కుచీరయితే! భేష్...బాగుంది. మరి దీనికి తగిన జాకెట్టూ?...ఊదాదవుతే దీని మీద అందంగా వుంటుంది.

అప్పుడే అయిదున్నరయి పోయిందే!

హెజ్‌లైనీ స్నో...వెన్యూసా అవుతే...అదే బావుంటుంది.

అయ్యో వాని షింగ్ క్రీం...మరిచిపోయానే. వెన్యూసాకంటే అది కమ్మని వాసన వేస్తుంది. ఈవినింగ్ యిన్ పారీసు అవుతే డ్రాలెసెంటు కంటె బాగా ఘాటుగా వాసన వేస్తుంది...లిప్ స్టిక్కేమిటి?...మతిపోయింది...తాంబూలము రైటు...మంచి సువాసనగా కూడా వుంటుంది.

ఆరు అవవస్తున్నది...ఇంకా పదినిమిషా లుంది...ఈలోపల...ఇంతకూ జగన్నాథం యెవరితో నయినా చెబుతాడేమో!...ఎంత అప్రతిష్ట...జగన్నాథం ఎంత వాగుబోతయినా లోతయినవాడే!...కాకపోతే కిందటి సంవత్సరం కోప పడ్డప్పుడే అల్లరిచేసి వుండేవాడు.

ఏదో మెట్లమీద చప్పుడవు తున్నది...ఇంకా జాకెట్టు తొడుక్కోలేదే...తలుపు వేస్తాను...

"అమ్మా – అమ్మగోరూ..."

"ఎవరది"

"నేను అప్పణ్ణి అమ్మ ..నాన్నగారు యీ వుత్తరం తమకివ్వ మన్నారు..."

'సరి – ఉత్తరం కిటికిలో పెట్టిపో ఏమిటి వుత్తరం...ఎక్కణ్ణుంచి?...

రాజేశ్వరీ

ఇన్నాళ్లనుంచీ వుత్తరం వ్రాయనందు కేమీ అనుకోకు. రేపురాత్రి మెయిలుకు బయలుదేరి యెల్లుండి ఉదయం మీ వూళ్లో దిగుతాను. నాకోసం స్టేషను దగ్గిరకు రావూ.

ఆనందరావు

చాలా ఆశ్చర్యం ... ఎంత పొరపాటు పడ్డాను...సరే మంచిదే...అయితే జగన్నాథం గతి? ... ఏమనుకుంటాడో...ఏడుస్తాడు! ఏడిస్తే

ఏడ్చాడులే ..నేనేం చేసుకున్నానా వాణ్ణి… వెధవకోతి ఆకారమూ వాడూ నూ…

ఒకపెద్ద ప్రొఫెసరుగారి భార్యను - ఒక గొప్ప ప్లీడరుగారి కూతుర్ని - ఒక కాలేజి కుర్రాడితోనా…ఛాఛా…

అయినా మాట యిచ్చానే…ఇందుకూ అని నోటితో చెప్పలేదుగా ..అయినా ఆయన రేపుగా వచ్చేది…ఇక రేపు సాయంత్రందాకా… అవును మరిచి పోయాను రేపు ఆదివారం కాదూ…

ఏం … యిన్నాళ్లనుంచీ చేయనిపని యీ కాస్తలో - అందులో యిరవై నాల్గు గంటలలో తొందర పడడ మెందుకు ?…

జగన్నాథం తిడతాడేమో…ఏడిశాడు. వాడికి అవకాశ మిస్తానా ?…

"అమ్మగారూ"

"ఏమిరా అప్పాసు - ఎందుకూ ?"

"ఎవరో జగన్నాథం గారట. తమతో చదువుకునే వారట. తమరికోసం వచ్చారు."

"ఇప్పుడు మాట్లాడేందు వీల్లే దన్నాననీ వెళ్ళమన్నాననీ చెప్పు"

* * *

ఎట్లా వెళ్తున్నాడో చూస్తాను.

అదేమిటి యెందుకంత ఏడుపుగొట్టు మొహంతో నడుస్తున్నాడు…నావంక చూస్తున్నాడు. నవ్వితే యింకా ఏడుస్తాడు…పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వొవస్తోంది…ఎలా ఆపుకోడం.

* * *


కామినియా టాయిలెటు సబ్బుల



ఆసియా ఖండములో ముఖ్యమయినవి. నిజమయిన సౌందర్యాన్ని యిచ్చి శుభ్రపరచడములో ప్రత్యేకతను చూపిస్తవి.

అనుకూలమయిన రకములున్నవి

కామినీయా వైటు రోజు సబ్బు (రిజి…

మంచి గులాబీ పూలసుగంధముతో వుంటుంది.

కామినీయా శాండల్ సబ్బు (రిజిష్టర్డు)

మంచి టాయిలెటు సబ్బు. మంచి గంధపు చె… నతో వుంటుంది.

దిల్ బహార్ సబ్బు (రిజిస్టర్డు)

దివ్య మయినది. చర్మమునకు చాలామంచిది. …వాసన ఎంతో ఆకర్షణీయముగా వుంటుంది.

మూడు బిళ్లల పెట్టె కిమ్మతు ౧౪ అణాలు. ఖర్చులు వేరు.

శాంపిల్ బిళ్ల అర్ధణా పోష్టుబిళ్ల పంపితే పంపుతారు.

కామినీయా స్నో (రిజిష్టర్డు)

ఉత్తమమయిన ముఖము మెరుగు. దీన్ని వుపయోగిస్తే ముఖానవుండే ముడతలు, మొటిమలు యింకా యితర అంద వికారమయిన పులిపిర్లు పోతవి. ముఖము ముఖమల్ అంత మెత్తగా తళతళ లాడుతూ వుంటుంది.

బుడ్డి కిమ్మతు ౧౨ అణాలు, ఖర్చులు ప్రత్యేకము.

అణా పోష్టు బిళ్లకు శాం… …తారు.

సోలు ఏజంట్లు :—

దిఆంగ్లో యిండియన్

డ్రగ్ & కెమికల్ కంపెని

బొంబాయి, 2